క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండలంలోని సిరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతు పనులు చేయనున్న సందర్భంగా సిరిపురం, శ్రీరంగాపురం, వల్లాపురం గ్రామాలకు ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇటీవల మరణించిన బీజేపీ బూత్ అధ్యక్షుడు పురాణం గోపి కుటుంబసభ్యులను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎ.నరేష్, ఉమామహేశ్వరరావు, కోటిరెడ్డి, కొండా హరీష్, గోపి, నాగరాజు, నాగేంద్రచారి, లక్ష్మణ్, బల్వంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద శనివారం హుజూర్‌నగర్ టు కోదాడ అడ్డా ఆటో యూనియన్ (బీఆర్ఎస్‌కేవీ అనుబంధ సంఘం) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీం, కోశాధికారిగా కె.కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా నరసింహ, వెంకటేశ్వర్లు, మురళిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువ కవి ఉపేందర్‌కు సన్మానం


కవి చిట్యాల ఉపేందర్‌ను సత్కరిస్తున్న కవులు

మోతె : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో తెలంగాణ సాహిత్య అకాడమీ, భవాని సాహిత్య వేదిక సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌సీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పహల్గాం కవితా సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి నామోజి బాలాచారి, కారం సత్యనారాయణస్వామి విశిష్ట అతిథులుగా పాల్గొని సంకలనంలో కవిత రాసిన మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన యువ కవి చిట్యాల ఉపేందర్‌ను ఘనంగా సత్కరించారు.

గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులకు శిక్షణ

నడిగూడెం : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశాల మేరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 19 వరకు నడిగూడెం గురుకులంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ

గరిడేపల్లి : సహకార సంఘాలు అందజేసే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పలువురు రైతులకు రూ.26లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు బి.అంజయ్య, దాసరి నర్సమ్మ, బొల్లెపల్లి రామనాథం, సీఈవో నిడికొండ కనకయ్య, సిబ్బంది కాట్రేవుల లక్ష్మయ్య, దొంగరి శ్రీనివాస్, పాలెల్లి అంజయ్య, నకిరేకంటి సాయిలు, కేశగాని హరీష్, రైతులు ముత్తినేని సోమయ్య, గుండు సైదయ్య, చింతల కోటయ్య, జుట్టుకొండ రమేష్, బొల్లెపల్లి సరిత, గురుమూర్తి, పాల్గొన్నారు.

పులిహోర పంపిణీ

నేరేడుచర్ల : పట్టణంలోని చలివేంద్రం వద్ద శనివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గుండా సత్యనారాయణ- పద్మావతి మానుమరాళ్లు సీబీఎస్ఈ 10వ తరగతిలో 91 శాతం, 8వ తరగతిలో శృతి 91 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన సందర్భంగా వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, లక్ష్మీనర్సింహారావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఐతా కృష్ణ, సుమంత్, గరిణె వాసు, చెరుకు రాము, వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణే జ్యోతి, కవిత, నటరాజ్, అరవింద్‌కుమార్, మధు ఉన్నారు.

మామిడి కూలీలకు అడ్డా రామాపురం

- మామిడి కాయలు కోయడంలో ఇక్కడి కూలీలకు మంచి అనుభవం
- సీజన్‌లో సూర్యాపేట, ఖమ్మం జిల్లాల నుంచి ఇక్కడి వారికే పిలుపు
- రెండు నెలలు కూలీలకు ఉపాధి


ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మామిడికాయలు కోస్తున్న రామాపురం కూలీలు


ట్రేలలో మామిడి కాయలు నింపుతున్న కూలీలు

నడిగూడెం : వేసవి కాలం వస్తే చాలు మామిడి రైతులకు రామాపురం గ్రామానికి చెందిన కూలీలు గుర్తుకొస్తారు. నడిగూడెం మండలంలోని వారికే కాదు చుట్టు పక్కల గ్రామాలు, దూర ప్రాంతాలకు చెందిన మామిడి రైతులకు కూడా రామాపురం కూలీలే గుర్తుకొస్తారు. అంత ఫేమస్ రామాపురానికి చెందిన కూలీలు. మండల కేంద్రానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న రామాపురానికి చెందిన అనేక మంది మామిడి కాయలను కోయడంలో అనుభవం కలిగిన కూలీలు. గతంలో ఆ గ్రామంలో వందల ఎకరాల్లో మామిడి తోటలు సా గులో ఉండేవి. గత రెండు తరాలుగా అదే గ్రామానికి చెందిన దాదాపు 150 మంది కూలీలకు మా మిడి కాయలు కోయడంలో అనుభవం ఉంది. న డిగూడెం మండలంలోనే కాదు పక్క మండలాల్లో కూడా అంతమంది లేరు. గత రెండు తరాలుగా మామిడి సీజన్ అయిన ఏప్రిల్, మే నెలలో మా మిడి కాయలను కోస్తూ ఉపాధి పొందుతున్నారు.

దూర ప్రాంతాలకు వెళ్తూ..

రామాపురంనకు చెందిన కూలీలు నడిగూడెం, మునగాల, మోతె, కోదాడ, చివ్వెంల, తుంగతుర్తి, మండలాలతో పాటు ఖమ్మం జిల్లా కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో మామిడి కోతల పనులకు వెళ్తుంటారు. గ్రామానికి చెందిన దాదాపు 150 మంది కూలీలు మామిడి కాయలను కోసి, ట్రేలలో నింపి వాహనాల్లో లోడు చేస్తారు. రోజుకు రూ.500 నుంచి రూ.600 కూలి పడుతుందని పలువురు కూలీలు చెబుతున్నారు.

కౌలుకు తీసుకోవడంలో ఇక్కడి రైతులే అధికం

నడిగూడెం, మునగాల, మోతె, కోదాడ మండలాల్లో మామిడి తోటలను కౌలుకు తీసుకోవడంలో రామాపురం రైతులే అధికం. చెట్ల సంఖ్యను బట్టి, కాతను బట్టి కౌలుకు తీసుకొని ఏళ్ల తరబడి ఆదాయం పొందుతూ జీవనం సాగిస్తున్నారు.

రెండు నెలలు పని దొరుకుతుంది



గత నాలుగైదు ఏళ్లుగా మామిడి కోతల పనులకు వెళ్తున్నాను. వేసవిలో ఖాళీగా ఉండే కూలీలు 10 మంది కలిసి మా చుట్టు పక్కల గ్రామాలతో పాటు, ఖమ్మం జిల్లాలో కూడా మామిడి కాయల కోతల పనులకు వెళ్తాం. రెండు నెలలు పూర్తిగా మామిడి కోతల పనులు దొరుకుతాయి. రోజుకు 500 నుంచి 600 కూలి పడుతోంది.

– నడ్డి బద్రి, రామాపురం

20 ఏళ్లుగా కౌలుకు తీసుకుంటున్నా



మా గ్రామంలో వరి పంట తర్వాత అధికంగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. గత 20 ఏళ్లుగా మా గ్రామంతో పాటు, ఇతర గ్రామాల్లో మామిడి తోటలను కౌలుకు తీసుకొని ఆదాయం పొందుతున్నాం. మామిడి కాయలు కోసే నైపుణ్యం ఉన్న కూలీలు మా గ్రామంలో ఉన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో మా గ్రామ కూలీలు బాగా ఫేమస్.

– నేలమర్రి శ్రీను, కౌలు రైతు, రామాపురం

ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమాలు


సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

గరిడేపల్లి: ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో జరిగిన సీపీఐ మండల మహాసభలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సభలో నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, పోకల వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, ధనుంజయ నాయుడు, మండవ వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, కుందూరు వెంకట్‌రెడ్డి, పంగ గోవింద్, వెంకటేశ్వర్లు, అంజన్‌రెడ్డి, ఎడ్ల అంజన్‌రెడ్డి, పున్నయ్య, రెమిడాల రాజు, బిళ్ల కనకయ్య పాల్గొన్నారు.

డప్పు కళాకారుడికి సన్మానం


డప్పు కళాకారుడు సతీష్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల :పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. శనివారం శిబిరంలో డప్పు కళాకారుడు అమరారపు సతీష్ డప్పు దరువుతో కళా ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా సతీష్‌ను మండల విద్యాధికారి పుట్టూరి సత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిక్షకులు ఎఎం. యాదగిరి, ఉపాధ్యాయులు ఎం. సైదులు, ఎం.బాలులాల్ సాహేబ్, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య


గరిడేపల్లి : కాచవారిగూడెంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


చిలుకూరు : బడిబాట కరపత్రం ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఒత్తిడి లేని గుణాత్మక విద్య అందుతుందని ఎంఈఓ చత్రు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుటకు పాఠశాలల చైర్‌పర్సన్లు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కేజీబీవీ ఎస్‌వో శైలజ, ప్రధానోపాధ్యాయుడు రవినాయక్, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, సాయిలు, సౌజన్య, సీఆర్పీలు అశోక్, రామకృష్ణ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాచవారిగూడెంలో బడిబాట

గరిడేపల్లి : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు కోనా శ్రావణి కోరారు. శనివారం మండల పరిధిలోని కాచవారిగూడెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీను, నాగరాజు, వెంకటయ్య, రవి, వీరయ్య, ముత్యాలమ్మ, దేవకుమారి, మరియమ్మ, లక్ష్మి, అంజి, నాగరాజు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చిలుకూరు : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. శనివారం చిలుకూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబాట ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాకపోకలకు మార్గం సుగమం


బ్రిడ్జిపై మట్టికుప్పలను చదును చేసిన కాంట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్

మునగాల : మండలంలోని మొద్దులచెరువు – మోతె ఆర్‌అండ్‌బీ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చే క్రమంలో భాగంగా విజయరాఘవపురం శివారులో నిర్మించిన బ్రిడ్జి మట్టికుప్పలు పోసి చదును చేయకపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో శనివారం సాక్షి దినపత్రికలో ×మట్టికుప్పలు ఇలా... ప్రయాణించేదెలా..՚అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు రోడ్డు కాంట్రాక్టర్ స్పందించి జేసీబీ సాయంతో మట్టికుప్పలను చదును చేసి రాకపోకలకు సౌకర్యం కల్పించాడు. తమ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షి దినపత్రిక యాజమాన్యానికి పలు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై గుంత.. రాకపోకలకు చింత


శాంతినగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంత

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలో శాంతినగర్ నుంచి పాత నేరేడుచర్లకు వెళ్లే రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి మురుగు నీరు నిలిచింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహాల వారితో పాటు నిత్యం ఈ రోడ్డుపై వెళ్లే ప్రజలకు ఇబ్బందిగా మారింది. డ్రెయినేజీ నీరు గుంతలోకి వచ్చి చేరుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. పైపులు దగ్ధం


పాత చిలుకూరులో దగ్ధమైన స్టార్టర్ బాక్స్

చిలుకూరు : మండల కేంద్రం నుంచి పాత చిలుకూరు, కొండాపురం, ఆర్లెగూడెం తదితర గ్రామాల్లో పలువురు రైతులు తమ పొలాల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో శనివారం పొలాల్లోని బావుల వద్ద విద్యుత్ మోటార్లు, స్టార్టర్ బాక్స్‌లు, పైపులు దగ్ధమయ్యాయి. దీంతో తీవ్రంగా నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. వరి కొయ్యలను కాల్చొవద్దని కోరుతున్నారు.

డొంకదారి ఆక్రమణ వివాదాస్పదం !

- కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు
- హద్దులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు
- సర్వేకు సహకరించని కొందరు రైతులు


జానకీనగర్‌లో గతంలో డొంక దారి ఉన్న ప్రాంతం

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో డొంక దారి ఆక్రమణ వివాదాస్పదంగా మారింది. జానకీనగర్ నుంచి దూదియాతండా వెళ్లే ప్రధాన దారిలో సెల్ టవర్ ఎదురుగా అక్కడ నుంచి 327 సర్వే నంబర్‌లో పూర్వ కాలం నుంచి కింది పొలాలకు డొంక దారి ఉండేదని, ఆ దారిని కొందరు రైతులు ఆక్రమించుకున్నారని గ్రామానికి చెందిన మంజులాల్ కుమారుడు మహేందర్ చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల ఫిర్యాదు అందజేశారు. డొంక దారిని పునర్నిర్మించాలని, డొంక దారి ఉంటే ముత్యాలమ్మ గుడికి గ్రామస్తులు వెళ్లేందుకు వీలుగా ఉంటుందని అధికారులకు వివరించారు. దీంతో రెవెన్యూ అధికారులు గతంలో డొంక దారి ఉన్న ప్రాంతాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే డొంక దారి కొంత వరకే లేదని, దిగువన ఉన్న పొలాల వరకూ ఉందని అక్కడి వరకు డొంక దారి తీయాలని ఒక వర్గం రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మొదట ఏర్పాటు చేసిన డొంక దారి హద్దులను గ్రామానికి చెందిన శివాజీ, శ్రీహరిలు తొలగించారని మహేందర్ మరోసారి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రైతులకు ముందుగా నోటీసులు పంపి శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వేకు వచ్చారు. కానీ రైతులు అక్కడికి రాకపోవడంతో సర్వే నిలిపివేసి ఈ నెల 22వ తేదీకి సర్వే వాయిదా వేశారు. ఈమేరకు ఫిర్యాదుదారుడు, రైతులకు నోటీసులు జారీ చేశారు. 22న రైతులు రాకపోతే పోలీస్ బందోబస్త్‌తో సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధం ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా శనివారం చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ గతంలో డొంక దారి ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ వ్యవహారం జానకీనగర్ గ్రామంలో చర్చనియాంశంగా మారింది. ఎలాంటి ఘర్షణలు జరగకుండా అధికారులు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన జల్లా నాగేశ్వరరావు- హేమలత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా రుచి ఫ్యామిలీ రెస్టారెంట్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సేకు శ్రీనివాసరావు, పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, డిస్ట్రిక్ ఇన్‌చార్జి చల్లా లక్ష్మీనర్సయ్య, డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇమ్మడి సతీష్‌బాబు, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆరినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష


బరాఖత్‌గూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగినంత నీరు అందించి కాపాడాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, మండల పంచాయతీ ప్రత్యేక అధికారి డి.శిరీష సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు బరాఖత్‌గూడెం, కృష్ణానగర్ గ్రామాల్లో గల నర్సరీలను ఆమె సందర్శించి మాట్లాడారు. నర్సరీల్లో ఖాళీగా ఉన్న సంచుల్లో విత్తనాలు విత్తాలని, నారుమళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా నర్సరీలలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఉపాధి హామీ ఏపీఓ శైలజ, టెక్నికల్ అసిస్టెంట్లు శేఖర్, శ్రీధర్‌రెడ్డి, మునగాల, బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీల కార్యదర్శులు, చంద్రశేఖర్, శ్వేత, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్.కృష్ణవేణి, దొంతిరెడ్డి సులోచన పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి


చిల్లేపల్లి వద్ద చెక్ పోస్ట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

నేరేడుచర్ల : సూర్యాపేట- నల్లగొండ జిల్లాల సరిహద్దు అయిన నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల సరిహద్దు చెక్ పోస్టును శనివారం హుజూర్‌నగర్ సీఐ చరమందరరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిల్లేపల్లి పోలీస్ చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఆవులను తరలిస్తుంటారని, వాటిని నియంత్రించడంతో పాటు నకిలీ విత్తనాలు, అక్రమ ధాన్యం, బియ్యం తదితర వాటిని తరలించకుండా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఈ చెక్ పోస్టు వద్ద ఏఎస్‌ఐతో పాటు నలుగురు పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. వచ్చే వాహనాలు స్పీడ్‌ను తగ్గించే వాటిని తనిఖీ చేయాలంటే స్టాఫర్లు అవసరమని గుర్తించిన వెంటనే నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌కు ఫోన్ చేసి స్టాఫర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


మేళ్లచెరువులో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ.రజితారెడ్డి


నడిగూడెంలో విత్తనాల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్, ఏఓ దేవప్రసాద్

మేళ్లచెరువు : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కోదాడ రూరల్ సీఐ.రజితారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో స్థానిక ఎస్ఐ. పరమేష్, మండల వ్యవసాయ అధికారిణి పద్మతో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు వానాకాలం సీజన్‌లో నాణ్యమైన పత్తి, మిరపతో పాటు వరి విత్తనాలు అందించాలని దుకాణాల యజమానులకు సూచించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్నాక రసీదు పొందాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే రైతులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వారి వెంట ఏఈఓ దుర్గాభవాని, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నడిగూడెంలో విత్తనాల దుకాణం తనిఖీ

నడిగూడెం : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ విత్తన దుకాణాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లు, విత్తన నమూనాలు పరిశీలించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు


మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. మోతె, నడిగూడెం, మునగాల పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్‌లు నడుపుతూ పట్టుబడిన పలువురు మైనర్లు, వారి తల్లిదండ్రులకు శనివారం మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన అవగాహన సదస్సు ఏర్పాటు చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం ద్విచక్రవాహన ప్రమాదాలతో పాటు రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపైన, పిల్ల ల తల్లిదండ్రులపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. లైసెన్స్, సీబుక్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, మైనర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి..


సమ్మేళనంలో పాల్గొన్న నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడలోని చైతన్యభారతి విద్యాలయంలో 1997-98 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చదివిన విద్యార్థులు శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్న నాటి స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

మునగాల : మునగాల గ్రామ పంచాయతీలో అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సభ్యుడు కొమ్ము ఈదారావు తెలిపారు. శనివారం మునగాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మునగాలలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని టీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మునగాలకు 56 ఇళ్లు మంజూరు కాగా అన్ని అర్హులకే కేటాయించామని తెలిపారు. హరిజన కాలనీలో 15 మంది అర్హులకు కేటాయించినట్లు వివరించారు. ఈ విషయమై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ఈదారావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాసర్ల కోటేశ్వరరావు, వేనేపల్లి వీరబాబు, కాసర్ల బోస్, లంజేపల్లి శ్రీనివాస్, చింతకాయల నాగరాజు, శెట్టి గిరి పాల్గొన్నారు.

